సాక్షి శ్రీకాకుళం

శనివారం । 30 । డిసెంబర్ । 2023



ఆదిత్య క్షేత్రానికి డీసీ హోదా

అరసవల్లి ఆదిత్య క్షేత్రం హోదా మారింది. అసిస్టెంట్ కమిషనర్ హోదా నుంచి డిప్యూటీ కమిషనర్‌కు పెరిగింది.

- 8లో



పోలీసుల స్పోర్ట్స్ మీట్

పోలీసుల స్పోర్ట్స్ మీట్ ఉత్సాహంగా మొదలైంది. పోలీసులు పోటీల్లో పాల్గొన్నారు.

- 8లో

బీఎడ్ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని బీఎడ్ మొదటి సెమిస్టర్ ఫలితాలను వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు శుక్రవారం విడుదల చేశారు. అనంతరం ఫలితాలను జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉంచారు. పరీక్షకు 994 మంది హాజరు కాగా, 789 మంది ఉత్తీర్ణత సాధించారు. 79.38 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రీవాల్యుయేషన్‌కు 15 రోజుల్లోగా చేసుకోవాలని చెప్పారు.

న్యూస్‌రీల్

తక్షణ ప్రవేశాలకు స్పందన కరువు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో తక్షణ ప్రవేశాలకు స్పందన కరువైంది. ఉన్నత విద్యా మండలి నిబంధన ప్రవేశాలపై ప్రభావం చూపింది. మరో పక్క తక్షణ ప్రవేశాలకు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు వర్తించవు. దీంతో విశ్వ విద్యాలయంలో చాలా పీజీ సీట్లు ఖాళీగా మిగిలిపోయాయి. తక్షణ ప్రవేశాలకు ఈ నెల 26 నుంచి 30 వరకు దరఖాస్తులు స్వీకరించారు. రాష్ట్ర పీజీ ప్రవేశ పరీక్షలో ర్యాంకు తప్పనిసరి చేశారు. దీంతో బయోటెక్నాలజీకి ముగ్గురు, ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఒక్కరు ప్రవేశాలు పొందారు. మిగతా కోర్సుల్లో చేరేందుకు ఎవరూ ఆసక్తి చూపించలేదు. వర్సిటీలో 16 కోర్సుల్లో 605 దరఖాస్తులు ఉండగా, 254 ప్రవేశాలు జరిగాయి. 351 సీట్లు మిగిలిపోయాయి. స్పాట్ అడ్మిషన్లు ముగ్గురు మాత్రమే పొందారు. సోషల్ వర్క్, రూరల్ డెవలప్‌మెంట్, జర్నలిజం, ఎంఈడీ, ఎకనామిక్స్ వంటి కోర్సుల్లో కనీస ప్రవేశాలు లేదు.

శ్రీముఖలింగేశ్వరుని ఆదాయం రూ.4.40 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో గడిచిన 56 రోజులకు గానూ హుండీ ఆదాయం రూ.4,40,306 వచ్చినట్లు ఈఓ పి.ప్రభాకరరావు శుక్రవారం తెలిపారు. ఆలయ ఆవరణలో అర్చకులు, భక్తులు సత్యసాయిసేవా సమితి సమక్షంలో హుండీని తెరిచి లెక్కించారు. కార్యక్రమంలో సిబ్బంది ఎం.సుకన్య, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

'కుష్టు నివారణకు కృషి'

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కుష్టు వ్యాధి నివారణే ధ్యేయంగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆయన శుక్రవారం వైద్యాధికారులతో సమావేశమయ్యారు. డిసెంబరు 27 నుంచి జనవరి 12 వరకు కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. రెండు వారాల పాటు ఇంటింటా సర్వే నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తించాలని, దీనికోసమే కలెక్టర్ ఆదేశాలపై 2,224 టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ టీంలో ఒక ఆశ, ఒక మేల్ వలంటీర్ ఒక టీమ్‌గా సందర్శించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామంలో రోజుకి 20 చొప్పున, పట్టణ పరిధిలో 50 చొప్పున ఇంటింటా సర్వే చేసి స్పర్శ లేని తెల్లని మచ్చలను గుర్తించి సంబంధిత వైద్యాధికారికి చూపించి వ్యాధి నిర్ధారణ అయితే బహుళ ఔషధ చికిత్స (ఎండీటీ) ద్వారా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో 219 కేసులు ఉన్నాయన్నారు. అనంతరం రెండు పోస్టర్లను విడుదల చేశారు.

ఆదిత్యుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ సురేష్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేష్‌రెడ్డి కుటుంబసమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి జిల్లా దేవదాయ శాఖ సూపరింటెండెంట్ బలివాడ ప్రసాద్ పట్నాయక్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు సంప్రదాయ పూర్ణకుంభ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆయన వెంట జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా, శ్రీకాకుళం ఆర్డీఓ సీహెచ్ రంగయ్య, జిల్లా కోర్టు ప్రొటోకాల్ సిబ్బంది, ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, ఎస్ఐ బలివాడ గణేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన శ్రీకూర్మం, శ్రీముఖలింగం ఆలయాలను కూడా సందర్శించారు.

'సంబరాలు మితిమీరవద్దు'

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా ప్రజలు శాంతియుతంగా నూతన సంవత్సర సంబరాలు జరుపుకోవాలని ఎస్పీ జీఆర్ రాధిక సూచించారు. ఈ నెల 31 సాయంత్రం నుంచి జిల్లాలోని అన్ని ముఖ్య పట్టణాల్లో ప్రధాన రహదారి మార్గాల్లో అతిగా మద్యం సేవించి వాహనాలు నడపినా, మైనర్లు నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో కేక్ కట్ చేయడం వంటివి చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. 1637 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, అన్నీ గమనిస్తామన్నారు.



టెక్కలి మండలం బూరగాంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా కూరగాయల పంటలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



ఇంతి పంట

- చిరుధాన్యాలు, ఆకు కూరలు సాగు చేస్తున్న మహిళా రైతులు
- జిల్లా వ్యాప్తంగా 36,891 మంది మహిళా రైతులతో 27,180 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం
- పండించిన పంటలను ఐకేపీ ద్వారా విక్రయాలు
- స్వయం సహాయక సంఘాల సభ్యులకే ఆదాయం



ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను విక్రయిస్తున్న స్వయం సహాయక సంఘాల్లో మహిళా రైతులు, సిబ్బంది

టెక్కలి: మహిళలు పొలాల్లోకి దిగుతున్నారు. రైతే రాజు నానుడిని రైతే రాణిగా మార్చేలా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంట పండించి చూపిస్తున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహాలను అందిపుచ్చుకుని స్వయం సహాయక సంఘాల సభ్యులు సాగు యాగాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం కూడా స్వయం సహాయక సంఘాల సభ్యులతో ఎలాంటి రసాయనాలు లేకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా చిరుధాన్యాలు, కూరగాయలు పండించేలా ప్రోత్సహిస్తోంది. వ్యవసాయ శాఖ ద్వారా రైతు సాధికార సంస్థ స్వయం సహాయక సంఘాల సభ్యులతో జిల్లాలో ప్రకృతి వ్యవసాయం చేయిస్తున్నారు. ఈ వ్యవసాయం ద్వారా పండిన పంటలను ఐకేపీ ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రాల్లో విక్రయించి తద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆయా మహిళా రైతులకే అందజేసే విధంగా కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ కార్యక్రమాన్ని దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు.

27,180 ఎకరాల్లో..

- జిల్లాలో ఎంపిక చేసిన స్వయం సహాయక సంఘాల్లోని 36,891 మంది మహిళా రైతులతో సుమారు 27,180 ఎకరాల్లో ఈ ప్రకృతి సాగు చేస్తున్నారు.
- చిరుధాన్యాలు, కూరగాయలు, కిచెన్ గార్డెన్ వంటి పంటలను ప్రోత్సహిస్తున్నారు.
- ఇదే ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆమదాలవలస మండలం నిమ్మతొర్లాడ పరిసర ప్రాంతాల్లో తయారు చేసిన బెల్లంను తిరుమల తిరుపతి దేవస్థానానికి అందజేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు.
- గత ఏడాది 15 టన్నులు ఎగుమతులు చేయగా, ఈ ఏడాది 100 టన్నులు ఎగుమతి చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.
- ఈ వ్యవసాయంపై ప్రత్యేక పర్యవేక్షణ కోసం జిల్లా వ్యాప్తంగా 316 మంది ఐసీఆర్‌పీ సిబ్బందిని నియమించారు. వీరి పర్యవేక్షణలో ప్రకృతి వ్యవసాయం చేయడంతో పాటు పండించిన పంటలను ప్రతి సోమ, మంగళ వారాల్లో నియోజకవర్గ కేంద్రాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో విక్రయిస్తారు.

ప్రత్యేకంగా శిక్షణ



రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయంపై జిల్లా వ్యాప్తంగా కొన్ని గ్రామాలతో పాటు కొంత మంది స్వయం సహాయక సంఘాల్లో మహిళా రైతులను ఎంపిక చేశాం. వీరితో పాటు ఐసీఆర్‌పీ సిబ్బంది, యూనిట్ ఇన్‌చార్జిలకు శిక్షణ అందజేశాం.

– ఎ.మాధవి, మాస్టర్ ట్రైనర్

సొంత పొలంలో..



మా గ్రామంలో సొంతంగా ఉన్న రెండు ఎకరాల పంట పొలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా కూరగాయలు పండిస్తున్నాం. ఎలాంటి రసాయనాలు లేకుండా పండించిన పంటలను విక్రయించి ఆదాయం పొందుతున్నాం. – కె.ఉషారాణి, మహిళా రైతు, లక్ష్మీపురం, సంతబొమ్మాళి మండలం



అవగాహన కల్పిస్తున్నాం



ప్రభుత్వం రైతు సాధికార సంస్థ ద్వారా నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయంపై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. అంతే కాకుండా స్వయం సహాయక సంఘాల్లో సభ్యులకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి సాగు చేయిస్తున్నాం. ఈ పంటలు ఎలాంటి రసాయనాలు లేకుండా పండిస్తున్నాం.

– డి.బాలకృష్ణ, యూనిట్ ఇన్‌చార్జి, టెక్కలి మండలం

నేరాలు తగ్గుముఖం



- 2023 వార్షిక గణాంకాలను వెల్లడించిన ఎస్పీ రాధిక
- జిల్లావ్యాప్తంగా 4618 కేసులు నమోదు



శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో నేరాలు తగ్గుముఖం పట్టాయని, గత రెండేళ్లతో పోల్చితే 2023లో తక్కువ సంఖ్యలో నమోదయ్యాయని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. ఆమె గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో పత్రికావిలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ ఏడాదికి సంబంధించి వార్షిక గణాంకాలను వెల్లడించారు. 2021లో 5022 కేసులు, 2022లో 5071 కేసులు నమోదు కాగా ఈ వార్షిక సంవత్సరంలో 4618 కేసులే నమోదయ్యాయని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై ఎక్కువ కేసులు నమోదయ్యాయని, శారీరక సంబంధిత నేరాలు, మహిళలపై నేరాలు, చిన్నపిల్లలపై లైంగిక నేరాలు, చోరీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, వైట్‌కాలర్ నేరాలు, మిస్సింగ్ కేసులు గణనీయంగా తగ్గాయన్నారు.

అక్రమాలపై ఉక్కుపాదం

ఎన్‌ఫోర్స్‌మెంట్ కిందట అక్రమ మద్యం, ఇసుక, గంజాయి, నాటు సారా నిర్మూలన, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు సంబంధించి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, లాఅండ్‌ఆర్డర్ విభాగం పోలీసులు సమన్వయంతో కలిసి 6195 కేసులు నమోదు చేశామన్నారు.. గత 2021లో 1616, 2022లో 1814 మాత్రమే నమోదయ్యాయని, ఈ సంఖ్యలు పరిశీలిస్తే నిషేధిత ఉత్పత్తుల అక్రమ రవాణా మార్గాలపై ఉక్కుపాదం మోపినట్లు తెలుస్తుందన్నారు.

తీవ్ర నేరాలు తగ్గుముఖం

జిల్లాలో హత్యాయత్నం కేసులు 2021లో 31, 2022లో 39 నమోదు కాగా.. ఈ ఏడు 25కు తగ్గాయని, కిడ్నాప్‌లు 2022లో 8 జరగ్గా ఈ యేడు ఆరుకు తగ్గాయని ఎస్పీ వివరించారు. మహిళలు, చిన్నారులపై వేధింపుల కేసులు కూడా తక్కువగానే నమోదయ్యాయని వివరించారు. 2022లో తప్పిపోయిన కేసులు 477 నమోదు కాగా ఈ ఏడు 410కు తగ్గాయన్నారు. లోక్ అదాలత్ ద్వారా 2023లో 6715 కేసులు పరిష్కరించారని తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయానికి సంబంధించి 1,420 స్పందన అర్జీలు రాగా 1,168 పరిష్కరించామని ఎస్పీ అన్నారు.

అవగాహనతోనే..

లాడ్జీలు, హోటళ్ల సందర్శకుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం కోసం ఐటీకోర్‌తో కలిసి విజిటర్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఏర్పాటు చేశామన్నారు. రోజువారీ పీటీ కేసుల్లో కోర్టు కేసుల విచారణలను నవీకరించడానికి వెబ్ ఆధారిత అప్లికేషన్ సీఎంఎస్ ద్వారా వేలిముద్రలతో కేసుల స్థితి తెలుసుకునే విధంగా ఐటీకోర్ కృషి చేసిందన్నారు. క్యాంపస్ కాప్స్, చిన్నారికి చేదోడు, విజువల్ పోలీసింగ్ వ్యవస్థ వల్ల శాంతి భద్రతలు అదుపులో పెట్టగలిగామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తరచుగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పెడుతూ జరుగుతున్న ప్రమాదాల ప్రదేశాలను గుర్తించి ఆయా చోట్ల సాంండ్రామ్స్, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. దిశ యాప్ గురించి విస్తృత అవగాహన, సైబర్, వైట్‌కలర్ నేరాలపై గ్రామాల్లో మహిళా పోలీసులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఎస్సీ, ఎస్టీ నేరాలు, మహిళలపై నేరాలు తగ్గాయన్నారు. కొత్త సంవత్సరంలో కూడా ఇదే విధంగా క్రైమ్‌రేట్ తగ్గిస్తామని ఎస్పీ వెల్లడించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు విఠలేశ్వరరావు, తిప్పేస్వామి పాల్గొన్నారు.

42,386 మందికి రూ.27.45 కోట్లు

- నాల్గో విడత జగనన్న విద్యా దీవెన నిధుల విడుదల



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జగనన్న విద్యా దీవెన కింద జిల్లాకు రూ.27.45 కోట్లు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమవుతున్నాయి. 2022–23 ఏడాది నాల్గో విడత జగనన్న విద్యా దీవెన ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం నుంచి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకోవాలని సూచించారు. డిగ్రీ తర్వాత సివిల్ సర్వీసెస్‌కు ఉన్న పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. విద్యకు పేదరికం అడ్డుకాకూడదు అన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. రానున్న రెండు మూడు రోజుల్లో తల్లుల ఖాతాల్లో డబ్బులు జమవుతాయని తెలిపారు.

- జిల్లాలో ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే 42,386 మంది విద్యార్థులకు గాను 39,003 తల్లుల ఖాతాల్లో రూ. 27.45 కోట్లు నగదు జమవుతుందని తెలిపారు.
- జిల్లాలో 4,359 మంది ఎస్సీ విద్యార్థులకు గాను 3,951 మంది తల్లుల ఖాతాల్లో రూ. 3,19,24,415.
- 1,126 మంది ఎస్టీ విద్యార్థులకు గాను 1,068 మంది తల్లుల ఖాతాల్లో రూ.60,72,960.
- 34,904 మంది బీసీ విద్యార్థులకు గాను 32,138 మంది తల్లుల ఖాతాల్లో రూ. 22,25,32,920.
- 1,302 మంది ఈబీసీ విద్యార్థులకు గాను 1,231 మంది తల్లుల ఖాతాల్లో రూ.85,59,482.
- 129 మంది ముస్లిం మైనారిటీ విద్యార్థులకు గాను 118 మంది తల్లుల ఖాతాల్లో రూ.7,46,954.
- 546 మంది కాపు విద్యార్థులకు గాను 526 మంది తల్లుల ఖాతాల్లో రూ. 45,73,773.
- 20 మంది క్రిస్టియన్ మైనారిటీ విద్యార్థులకు గాను 18 మంది తల్లుల ఖాతాల్లో రూ.1,85,024 లు జమ చేస్తారని తెలిపారు.

పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ జగనన్న విద్యా కానుక విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేదరికం చదువుకు అడ్డుకాకూడదని, ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నదే ముఖ్యమంత్రి ఉద్దేశమన్నారు.

విద్యార్థుల స్పందన

- శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థులు మాట్లాడుతూ పేద విద్యార్థులు సాఫీగా చదువుకోవడానికి విద్యాదీవెన, వసతి దీవెన ఎంతో సాయపడుతున్నాయని తెలిపారు.
- శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థిని భవానీ తమ లాంటి పేదలకు ఈ పథకాలు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయని, తల్లి దండ్రులపై భారం పడకుండా ఉంటుందని చెప్పారు.
- సన్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్న ఎస్. సతీష్ మాట్లాడుతూ తన తండ్రి ఆటో డ్రైవర్ అని, ఆర్థిక సమస్యలతో సతమతమయ్యే కుటుంబాలకు విద్యాదీవెన ఒక వరమన్నారు. మన సీఎం చదువుకు బాటలు వేస్తున్నారని, స్వదేశంలోనేకాదు విదేశాల్లో ఉన్నత విద్యను అందజేస్తున్నారని అన్నారు.
- సన్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్న సాయి ప్రజ్వల మాట్లాడుతూ తన తండ్రి ఒక హోటల్‌లో పనిచేస్తున్నారని, తల్లి గృహిణి అని తెలిపారు. ఇద్దరు పిల్లలను చదివించే స్తోమత వారికి లేదని, అలాంటి తమకు విద్యా దీవెన ఒక అద్భుతమైన అవకాశమని తెలిపారు.
- డిగ్రీ చదువుతున్న కావ్య మాట్లాడుతూ ఆడపిల్లలకు చదువు ఎందుకు అనే సమయంలో ముఖ్యమంత్రి అందిస్తున్న జగనన్న విద్యా దీవెనతో చదువుకోవడానికి అవకాశం కలిగిందని అన్నారు.

అనంతరం జగనన్న విద్యా దీవెన నమూనా చెక్కును విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విశ్వమోహన్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ ఏటీడబ్ల్యూఓ శ్రీనివాసరావు, డీబీసీడబ్ల్యూఓ అనురాధ, ఏఎస్‌డబ్ల్యూఓ ఎం.సుజాత, పలు కళాశాలల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నమూనా చెక్కు అందజేస్తున్న జేసీ నవీన్, ఎమ్మెల్యే రెడ్డి శాంతి తదితరులు

ఎస్ఐలకు స్థానచలనం



శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తున్నట్లు జిల్లా పోలీసు శాఖ కార్యాలయం నుంచి శుక్రవారం ఓ ప్రకటన వెలువడింది. ఈ మేరకు.. అనకాపల్లి జిల్లా నుంచి మన జిల్లాకు 11 మంది రానుండగా ఇటు నుంచి అటు 11 మంది ఎస్ఐలను బదిలీపై కేటాయించారు. బదిలీపై అనకాపల్లి నుంచి వచ్చిన వారిలో మోర్త సురేంద్రకుమార్, ఉగ్రంగి రాజారావు, మహదాసు వెంకటరావు, షాయిక్ రషీద్, జక్కుల నాగేశ్వర్రావు, గనివాడ విశ్వనాథం, పిల్లా ప్రసాదరావు, కుదుముల సత్యనారాయణ, పంగి వారి, పీవీ వెంకటరమణ, షయ్యక్ మదీనావలీ ఉండగా, ఇక్కడ నుంచి అనకాపల్లి వెళ్లే వారిలో బి.రామారావు, ఎస్.గఫూర్, పి.వెంకటరమణ, ఎస్.సోమశేఖరరావు, టి.రామారావు, జె.రామారావు, ఎం.కోటేశ్వరరావు, ఏఎస్‌వీ వెంకటరావు, పి.శ్యామలరావు, కె.రమేష్ బాబు, ఎం.వి.రమణలు ఉన్నారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లా, విజయనగరం జిల్లాల నుంచి ఇద్దరేసి చొప్పున నలుగురు ఎస్ఐలు యు.భవాని, కె.గోవిందరావు, చప్పా హేమంత్‌కుమార్, డి.విజయ్‌కుమార్ శ్రీకాకుళం జిల్లాకు బదిలీ కాగా మన జిల్లానుంచి అల్లూరి సీతారామరాజు జిల్లాకు ఎస్.సాంబ్రదొర, డి.రేణుక బదిలీ అయ్యారు.

పెద్ద నిర్ణయాలే తీసుకోవాలి..

- పలాస పీహెచ్‌సీని మరోసారి సందర్శించిన మంత్రి అప్పలరాజు



పలాస సీహెచ్‌సీ తనిఖీల్లో రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమల మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు శుక్రవారం తనిఖీ చేశారు. రెండు రోజుల కిందటే పరిశీలించిన మంత్రి మళ్లీ తనిఖీకి రావడంతో సిబ్బంది అవాక్కయ్యారు. అటు వైద్యులు, ఇటు సిబ్బంది హాజరు, పనితీరులో మార్పు వస్తుందని భావించినా తీరు మారకపోవడంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. పనితీరు మారకుంటే పెద్ద నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. ఆస్పత్రిలో పలు విభాగాలను తనిఖీ చేసిన అనంతరం ఓపీ, వైద్యుల విభాగం, అత్యవసర విభాగాలను స్వయంగా వెళ్లి చూశారు. పదకొండు మంది వైద్యులు రావాల్సి ఉండగా.. ఇద్దరు మాత్రమే హాజరు కావడంపై నివ్వెరబోయారు. గైనిక్ విభాగం పూర్తిగా మూసివేసి ఉండటంపై ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 300 ఓపీ ఉన్న ఆస్పత్రిలో వివిధ ప్రత్యేక విభాగాల వైద్యులు లేకపోవడం, హెడ్ నర్సుతో పాటు ఇతర వైద్య సిబ్బంది లేకపోవడంపై ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తక్షణమే శాఖాపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుతో పాటు మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు, ఏఎంసీ చైర్మన్ పీవీ సతీష్‌కుమార్, వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, మీసాల సురేష్‌బాబు, జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షులు బెల్లాల శ్రీనివాసరావు, ప్రభుత్వ విప్ శంకర్‌పండా, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్‌కుమార్, గౌరీ త్యాడీ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాల అమలుపై సంతృప్తి

కొత్తూరు: కేంద్రం అందజేస్తున్న పథకాలను ఇక్కడ చక్కగా అమలుచేస్తున్నారని జాతీయ వైద్య సేవలు, నాణ్యత ప్రమాణాల పరిశీలన కమిటీ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. కమిటీ సభ్యులు రేఖ, డాక్టర్ రాధిక లాల్‌మణిలు శుక్రవారం కొత్తూరు మండలం మాకవరం, వసప వెల్‌నెస్ సెంటర్లను శుక్రవారం పరిశీలించి రికార్డులను చూశారు. ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకం, ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు, పీఎం వైద్యారోగ్య కార్డులతో పాటు పలు రకాల పథకాలు ప్రజలకు ఎలా అందుతున్నాయో చూశారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లతో మాట్లాడారు. కార్యక్రమంలో కురిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి సందీప్ కుమార్, ఈఓ బుజ్జిబాబు, సూపర్‌వైజర్ తిరుపతిరావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



కొత్తూరు మండలం మాకవరం వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జాతీయ నాణ్యత కమిటీ సభ్యులు



ఆదిత్య క్షేత్రానికి డీసీ హోదా

- అసిస్టెంట్ కమిషనర్ నుంచి డిప్యూటీ కమిషనర్ హోదాకు పెంచుతూ గెజిట్ జారీ
- ఆలయంలో సౌకర్యాల పెంపునకు మార్గం సుగమం

అరసవల్లి: ప్రఖ్యాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి హోదా పెరిగింది. ఇంతవరకు అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ) హోదాలో అధికారి కార్యనిర్వహణాధికారిగా పనిచేసిన ఈ ఆలయంలో ఇకమీదట డిప్యూటీ కమిషనర్ (డీసీ) హోదా అధికారి కార్యనిర్వహణాధికారిగా పనిచేయనున్నారు. అరసవల్లి సూర్యదేవాలయ వార్షికాదాయం తాజా లెక్కల ప్రకారం రూ.8.41 కోట్లుగా నమోదైంది. రూ.7కోట్లకు మించడంతో హోదా పెరిగింది. ఆలయాల్లో సౌకర్యాల ప్రగతి, ఆలయాల హోదాల పెంపుపై ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష నిర్వహించిన క్రమంలో తాజాగా రాష్ట్ర శాఖ కమిషనర్ సత్యనారాయణ ధ్రువీకరణతో గెజిట్ విడుదలయ్యింది. మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఆలయ పాలకమండలి సభ్యులందరి సూచనల మేరకు ఆలయంలో ఇటీవల సౌకర్యాల కల్పనతో పాటు అభివృద్ధి పనులు జరుగుతున్న క్రమంలో తాజాగా హోదా పెంపు మరింత అభివృద్ధికి ఊతమివ్వనుంది.

మరిన్ని సౌకర్యాలు



అరసవల్లి ఆలయానికి సహాయ కమిషనర్ హోదా నుంచి ఉప కమిషనర్ హోదాను పెంచుతూ గెజిట్ జారీ అయ్యింది. దీంతో స్థానిక ఆలయంలో భక్తులకు సౌకర్యాల కల్పన, బడ్జెట్ కేటాయింపులతో పాటు ముఖ్యంగా అదనపు సిబ్బంది నియమకాలు పెరగడంతో క్యాడర్ స్ట్రెంత్ పెరగనుంది. దీంతో సౌకర్యాలు కూడా పెరుగుతాయి.
– వి.హరిసూర్యప్రకాష్, జిల్లా దేవదాయ శాఖాధికారి



ఆదిత్య క్షేత్రం హోదా పెరగడంతో ఉద్యోగుల సంఖ్య కూడా పెరుగుతుంది. ఇప్పటివరకు ఇక్కడ సూపరింటెండెంట్–1, సీనియర్ అసిస్టెంట్లు –2, జూనియర్ అసిస్టెంట్లు–3, రికార్డు అసిస్టెంట్లు–3, అటెండర్లు–4 తదితర పోస్టులు ఉన్నాయి. రానున్న కాలంలో అవి పెరుగుతాయి.

క్లుప్తంగా

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లగేజీ ఆటో



ఒరిగిన విద్యుత్ స్తంభం

సోంపేట: మండలంలోని బారువ నుంచి సోంపేట వెళ్లే మార్గంలో పలాసపురం గ్రామ సమీపంలో శుక్రవారం విద్యుత్ స్తంభాన్ని లగేజీ ఆటో బలంగా ఢీకొంది. దీంతో విద్యుత్ స్తంభం విరిగి, ఒరిగిపోయింది. ప్రమాదంలో ఆటోలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

అంతర్ కళాశాలల క్రికెట్ జట్టు ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో శని, ఆదివారాల్లో జేఎన్‌టీయూ విజయనగరం పరిధిలోని కళాశాలలకు సంబంధించి అంతర్ కళాశాలల క్రికెట్ జట్లు ఎంపిక చేయనున్నట్లు శివానీ కళాశాల మేనేజ్‌మెంట్ సభ్యులు, జేఎన్‌టీయూ విజయనగరం పాలక మండలి సభ్యులు దుప్పల వెంకటరావు తెలిపారు. కళాశాలలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. విశ్వవిద్యాలయం పరిధిలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతాలకు చెందిన 34 కళాశాలల నుంచి క్రీడాకారులు ఈ ఎంపికలకు హాజరు కావాలని అన్నారు. ఎంపికైన వారు జనవరి 7 నుంచి 16 వరకు తమిళనాడు రాష్ట్రం హిందుస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్సెస్ విశ్వవిద్యాలయంలో నిర్వహించే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని అన్నారు.

తమిళనాడులో శ్రీకాంత్ బృందం నాట్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన చేస్తున్న శ్రీకాంత్ బృందం

శ్రీకాకుళం కల్చరల్: తమిళనాడు రాష్ట్రం కరూర్ జిల్లా పశుపతేశ్వర దేవాలయ ప్రాంగణ కళావేదికపై శ్రీకాంత్ బృందం ప్రదర్శించిన నృత్య ప్రదర్శన అందరినీ మెప్పించింది. వారం రోజులపాటు నిర్వహిస్తున్న ఆరుద్ర నక్షత్ర దర్శన అంతర్జాతీయ నృత్యోత్సవంలో శ్రీకాకుళానికి చెందిన రఘుపాత్రుని శ్రీకాంత్ 12మంది శిష్యులతో కలసి కూచిపూడి నాట్యం ప్రదర్శించారు. ఈ సందర్భంగా కరూర్ నాట్యాంజలి ట్రస్టు సభ్యులు శివలోగనాథన్, అరుణ్ బాలకృష్ణన్, బాలగోపాలన్ గురు శ్రీకాంత్‌తో పాటు 12మంది శిష్యులను ఘనంగా సత్కరించారు. ఇందులో నాట్య కారులు రామకొండిన్య, గాయత్రి వర్షిత, నేహ, హిమబిందు, ససాహిత్య, చాందిని, హర్షిత, సుష్మ, శ్రీకళ, ప్రణవి, కాలగ్నలు పాల్గొన్నారు.

హోరాహోరీగా టెన్నీ కాయిట్ పోటీలు



గెలుపొందిన క్రీడాకారులతో జిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

పాతపట్నం: పాతపట్నం మినీ స్టేడియం క్రీడా మైదానంలో అంతర్ జిల్లాల టెన్నీ కాయిట్ పోటీలు శుక్రవారం హోరాహోరీగా జరిగాయి. బాలుర విభాగంలో పి.రాజేష్ బెహరా (శ్రీకాకుళం), డి.త్రిమూర్తులు (తూర్పు గోదావరి), వి.వినయ్ కుమార్(తూర్పు గోదావరి), పి.జే.ఎం.డి రామారావు(తూర్పు గోదావరి), కె.వంశీ (పశ్చిమ గోదావరి), కె.గోవిందరావు(శ్రీకాకుళం), సీహెచ్ తారకేశ్వరరావు(శ్రీకాకుళం), బి.చంటిబాబు(పశ్చిమ గోదావరి), బాలికల విభాగంలో ఆర్.మౌనిక (విజయనగరం), జి.అమృత(అనకాపల్లి), ఎం.ప్రవల్లిక(విజయనగరం), వై.అలేఖ్య(పశ్చిమ గోదావరి), పి.రేణుక(విజయనగరం), కే.మౌనిక(పశ్చిమ గోదావరి), జి.శ్రావణి(విజయనగరం), పి.విశ్వేతశ్రీ(విశాఖపట్నం) ఫైనల్స్‌కు చేరుకున్నారని జిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు యెన్ని శేఖరబాబు, పిట్ట తవిటయ్యలు తెలిపారు.

ఈవీఎం గోదాముల పరిశీలన



ఈవీఎంల గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, పలు పార్టీల నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఈవీఎం నిల్వ ఉంచే గోదామును కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ శుక్రవారం పరిశీలించారు. త్రైమాసిక పరిశీలనలో భాగంగా ఆయన గోదామును ఓపెన్ చేయించి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఎలాంటి సమస్యలు లేకుండా సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు.

ముగిసిన అంతర్ పాలిటెక్నిక్ క్రీడల పోటీలు



బహుమతులతో ఓవరాల్ చాంపియన్‌షిప్ క్రీడాకారిణులు



బహుమతులతో ఓవరాల్ చాంపియన్‌షిప్ క్రీడాకారులు

ఎచ్చెర్ల క్యాంపస్: సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన శ్రీకాకుళం ప్రాంతీయ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడలు, ఆటలు పోటీలు– 2023 శుక్రవారం ముగిశాయి. శ్రీకాకుళం ప్రాంతీయ పరిధి పది పాలిటెక్నిక్ కళాశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ మూడు రోజుల్లో విజేతలు రాష్ట్రస్థాయిలో జనవరి 4, 5, 6 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొంటారు. ముగింపు కార్యక్రమంలో విజేతలకు సాంకేతిక విద్యాశాఖ డీడీ రామకృష్ణ, ప్రిన్సిపాల్ బి.రామకృష్ణ బహుమతులు అందజేశారు. ఈ క్రీడల పోటీల్లో మహిళలు విభాగంలో వ్యక్తిగత చాంపియన్‌షిప్ ఎం.మౌనిక (వెంకటేశ్వర పాలిటెక్నిక్), పురుషుల విభాగంలో వ్యక్తిగత చాంపియన్‌షిప్ ఎం.నాగరాజు (వెంకటేశ్వర పాలిటెక్నిక్) సాధించారు. ఓవరాల్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ బాలురు, బాలికలు రెండు విభాగాల్లో వెంకటేశ్వర పాలిటెక్నిక్ విద్యార్థులు సాధించారు. మహిళల ఓవరాల్ గేమ్స్ చాంపియన్‌షిప్ శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, పురుషుల ఓవరాల్ గేమ్స్ చాంపియన్ షిప్ శ్రీ వెంకటేశ్వర పాలిటెక్నిక్ కళాశాల సాధించాయి. డీడీ మాట్లాడుతూ విజేతలు రాష్ట్రస్థాయిలో సత్తాచాటాలని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ జి.దామోదర్‌రావు, సీనియర్ అధ్యాపకులు మురళీకృష్ణ పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లో షార్ట్ సర్క్యూట్

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస మండలం అక్కివరం పంచాయతీ పరిధిలో కొత్త రోడ్డు సమీపం జీఎన్‌ఆర్ అపార్ట్‌మెంట్‌లో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. ఈ ప్రమాదంలో గృహోపకరణాలు, విద్యుత్ వైరింగ్, ఇతరత్రా పరికరాలు దగ్ధమైనట్లు అపార్ట్‌మెంట్ వాసులు తెలిపారు. ఈ అపార్ట్‌మెంట్‌లో 16 ప్లాట్లకుగాను 13 ప్లాట్లలో కుటుంబాలు నివాసం ఉంటున్నట్లు తెలిపారు. అగ్నిమాపక అధికారులు వచ్చి మంటలను అదుపు చేశారు.

రివార్డ్ పాయింట్స్ పేరిట సైబర్ మోసం

- రూ. 59, 999లకు టోకరా

శ్రీకాకుళం క్రైమ్ : ఆమదాలవలస మండలం కొర్లకోట గ్రామానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి ఎస్బీఐ బ్యాంక్ రివార్డ్ పాయింట్స్ పేరిట సైబర్ మోసానికి గురయ్యాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు శుక్రవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆమదాలవలస ఎస్ఐ కృష్ణ చెప్పిన వివరాల మేరకు.. కొర్లకోటకు చెందిన జి.తేజేశ్వరరావు మొబైల్‌కు ఈ నెల 19న రాత్రి 7:52 గంటలకు బిఎ–562927 అనే నంబర్‌తో హెచ్‌టీటీపీఎస్://డిఎఎల్‌ఒపి.విఇఆర్‌సిఎల్.
ఎపిపి/ లింక్ వచ్చింది. ఆ లింక్‌పై క్లిక్ చేయగా రూ. 9980 ఎస్‌బీఐ బ్యాంక్ రివార్డ్ పాయింట్స్ వచ్చాయి. బ్యాంకు పేరు ఉండడంతో తేజేశ్వరరావు లింక్‌కు క్లిక్ చేశారు. అందులో ఎస్‌బిఐ.ఓఎన్‌ఎల్‌ఐఎన్‌ఇ వెబ్‌సైట్ రాగా లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్, మొబైల్ నెంబర్ ఎంటర్ చేశాడు. ఓటీపీ ఎంటర్ చేసిన వెంటనే తన ఖాతా నుంచి రూ.49,999లు, రూ.వెయ్యి రెండు దఫాలుగా కట్ అయ్యాయి. వెంటనే తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ సెల్ నంబరు 1930కి ఫిర్యాదు చేశాడు. మరుసటి రోజు సంబంధిత బ్యాంకుకు వెళ్లి ఫిర్యాదు చేశాడు. జార్ఖండ్, కోల్‌కతా నుంచి తన డబ్బులు డ్రా అయినట్లు బ్యాంకు సిబ్బంది ద్వారా గుర్తించాడు. దీంతో బాధితుడు శుక్రవారం ఆమదాలవలస పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదైనట్లు చెప్పారు.

‘లైఫ్ సేవ్‌స్టిక్’కు రాష్ట్రస్థాయి అవార్డు



రాష్ట్రస్థాయి సైన్స్ పోటీల్లో అవార్డు తీసుకుంటున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: కడపలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ పోటీల్లో ‘లైఫ్ సేవ్ స్టిక్ ఫర్ ఫార్మర్’కు అవార్డు లభించిందని సైన్స్ పర్యవేక్షణాధికారి కుమార స్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆమదాలవలస మండలం చింతాడ గ్రామంలోని మున్సిపల్ హైస్కూల్‌లో పనిచేస్తున్న ఫిజిక్స్ టీచర్ పి.గౌరీశ్వరరావు ఈ స్టిక్‌ను రూపొందించారు.

‘అదనపు ఆదాయానికి ప్రణాళికలు’



సంఘ సభ్యులతో మాట్లాడుతున్న చైర్మన్ కృష్ణమూర్తి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా సహకార సంఘానికి అదనపు ఆదాయ వనరులను సమకూర్చే దిశగా పక్కా ప్రణాళిక రూపొందిస్తున్నామని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్ గొండు కృష్ణమూర్తి అన్నారు. నగరంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. చైర్మన్ గొండు కృష్ణమూర్తి మాట్లాడుతూ జిల్లాలో గల సంఘ ఆస్తులను రక్షించేందుకు ప్రహరీలు, గోదాములను మరమ్మతు చేస్తామని, ఖరీఫ్ సీజన్ 2023–24కు సంబంధించి రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని అన్నారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జన ఔషధీ కేంద్రాలను ఇప్పటికే జిల్లా కేంద్రంలో మూడు ఏర్పాటు చేయగా అరసవిల్లి ఆదిత్యనగర్ కాలనీలో మరొకటి ఏర్పాటు చేశామన్నారు. తక్కువ ధరలకే వీటి ద్వారా మందులు దొరుకుతాయన్నారు. శిథిలావస్థలో ఉన్న స్థలాలను, భవనాలను షాపులుగా మార్చుతామన్నారు. రైతులకు పశువుల దాణా అందించే ఉద్దేశంతో ఇప్పటికే రెండు లోడ్ల దాణాను శ్రీకాకుళం, గారలో సరఫరా చేశామన్నారు. మరిన్ని లోడ్లను తెప్పించే పనిలో ఉన్నామన్నారు. సమావేశంలో బిజినెస్ మేనేజర్ ఎం.జగ్గనాయుడు, సంఘ డైరెక్టర్లు సల్లా సుగుణ, నక్క ప్రసాదరావు, జల్లు బలరాం నాయుడు, బంటు దుర్గారావు, నర్తు గంగమ్మ పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోలీసుల స్పోర్ట్స్ మీట్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న వార్షిక క్రీడలు, ఆటలు పోటీల మీట్–2023ను శుక్రవారం ఎస్పీ జీఆర్ రాధిక ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ఆర్మ్‌డ్ రిజర్వ్, హోం గార్డు విభాగాలతో పాటు శ్రీకాకుళం, టెక్కలి, కాశీబుగ్గ సబ్ డివిజన్ పోలీసులు ఈ క్రీడల్లో పాల్గొన్నారు. ముందుగా క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించి, గౌరవ వందనం చేశారు. జాతీయ, క్రీడా పతాకాలు ఆవిష్కరించిన అనంతరం క్రీడాకారులు ప్రతిజ్ఞ చేశారు. రెండు రోజుల పాటు అథ్లెటిక్స్‌తో పాటు కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్ వంటివి నిర్వహించనున్నారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు స్పోర్ట్స్ మీట్‌లో సత్తా చాటాలని కోరారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వీఎన్ మణికంఠ, టీపీ విఠలేశ్వర్, డీఎస్పీలు వై.శృతి, సీహెచ్ ప్రసాదరావు, ట్రైనీ డీఎస్పీ సీహెచ్ రాజా, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.



స్పోర్ట్స్ మీట్ ప్రారంభం సందర్భంగా బెలూన్లు విడిచిపెడుతున్న ఎస్పీ జీఆర్ రాధిక, పోలీస్ అధికారులు

సచివాలయ వ్యవస్థతో పరిపాలనలో సాధికారత



కుసుంపురంలో సచివాలయ నూతన భవనం ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ పిరియా విజయ

కవిటి: సచివాలయ వ్యవస్థతో పాలనలో సాధికారతకు సీఎం వైఎస్ జగన్ బాటలు వేశారని శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని కుసుంపురం గ్రామ సచివాలయం కార్యాలయ నూతన భవనాన్ని ఆమె ఎమ్మెల్సీ నర్తు రామారావుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సచివాలయ ఉద్యోగులతో సమీక్షించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, వైస్ ఎంపీపీ పూడి నేతాజీ, ఏఎంసీ చైర్మన్ నూతలపాటి బాబూరావు, వైస్ చైర్మన్ వై.నీలయ్య, పీఏసీఎస్ చైర్మన్ దేవరాజ్‌సాహూ, స్థానిక ప్రజాప్రతినిధులు ఊర్మిళాబిసాయి, కె.పద్మావతి, నేతలు బద్రి ప్రకాష్, దుద్ది సతీష్, కె.బాలయ్య, నల్లాన శ్రీనివాసరావు, కిర్ర ఢిల్లేష తదితరులు పాల్గొన్నారు.

నంది నాటకోత్సవాల్లో జిల్లా కళాకారులకు అవార్డులు



అవార్డు అందుకుంటున్న కళాకారులు

శ్రీకాకుళం కల్చరల్: గుంటూరు వేంకటేశ్వర విజ్ఞాన మందిర్‌లో ఈనెల 23 నుంచి 29 వరకు నిర్వహించిన నందినాటకోత్సవ పోటీల్లో ఇద్దరు జిల్లా కళాకారులకు అవార్డులు దక్కాయి. నగరంలోని కోర్టులో పనిచేస్తున్న మెట్ట వెంకటరాజుకు ‘కొత్త పరిమళం’ నాటికలో బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్‌గా నంది అవార్డు, నగదు బహుమతిగా రూ.12,500లు ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, సినీనటులు పోసాని మురళీకృష్ణ చేతుల మీదుగా అందుకున్నారు. అలాగే గుంటూరు వారి అతీతం నాటికకు ఉత్తమ సంగీతం నంది అవార్డును, నగదు బహుమతిగా రూ.12,500లు లీలామోహన్ కూడా అందుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ విజయ్‌కుమార్ రెడ్డి, జనరల్ మేనేజర్ శేషసాయిలు ఉన్నారు. ఈ సందర్భంగా కళాకారుల సమాఖ్య సభ్యులు చిట్టి వేంకట రావు, ఎల్.రామలింగస్వామి, పన్నాల నర్సింహమూర్తి, బి.రామచంద్రదేవ్, తదితరులు అభినందించారు.

గణతంత్ర వేడుకలకు లక్ష్మీదమయంతి



టి.లక్ష్మీ దమయంతి

శ్రీకాకుళం న్యూకాలనీ: దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించే గణతంత్ర వేడుకలకు శ్రీకాకుళం జిల్లాకు చెందిన విద్యార్థిని టి.లక్ష్మీ దమయంతి ఎంపికైంది. ఈమె కృష్ణా విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతోంది. అక్కడ 16వ ఆంధ్రా బెటాలియన్ పరిధిలో ఎన్‌సీసీ క్యాడెట్‌గా శిక్షణ పొందుతోంది. సికింద్రాబాద్‌లో నిర్వహించిన ఏడు శిక్షణా శిబిరాల్లో ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చింది. పది వేల మంది ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్న శిబిరాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి వేడుకలకు ఎంపికైంది. ఈమె స్వస్థలం శ్రీకాకుళంలోని తిలారు కాగా, ప్రస్తుతం ఆమదాలవలసలో నివాసం ఉంటోంది. తండ్రి టి.జనార్ధనరావు, తల్లి టీఎస్ఎన్ రత్నం. లక్ష్మీ దమయంతిని శుక్రవారం పలువురు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాబూరావు

శ్రీకాకుళం రూరల్, సరుబుజ్జిలి: మండల పరిధిలోని సనపలవానిపేట వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సరుబుజ్జిలి మండలం పెద్ద షళంత్రి గ్రామానికి చెందిన మామిడి బాబూరావు (24) అక్కడికక్కడే మృతి చెందారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బాబూరావు పీజీ పూర్తి చేశాడు. ఖాళీగా ఉండడం ఇష్టం లేక షళంత్రిలోని ఇండియన్ బ్యాంక్‌లో డాక్యుమెంట్ రైటర్‌గా తాత్కాలికంగా పని చేస్తున్నాడు. ఇదే బ్యాంకులో అతని స్నేహితుడు రాజేష్‌కుమార్ అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఈయన శ్రీకాకుళంలోని వెంకటాపురంలో ఆరు నెలలుగా ఉంటున్నారు. గురువారం రాత్రి ఇద్దరూ విధులు ముగించుకుని శ్రీకాకుళం వచ్చారు. మరుసటి రోజు శుక్రవారం ఉదయం ఇద్దరూ స్కూటీపై బ్యాంకుకు బయల్దేరారు. శ్రీకాకుళం నుంచి నందగిరిపేట, సనపలవానిపేట పరిసర ప్రాంతంలోకి వెళ్లగానే శ్రీకాకుళం నుంచి పాలకొండ వెళ్తున్న ఆర్టీసీ బస్సు లారీని తప్పించబోయి వీరి బండిని ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న రాజేష్‌కుమార్ తుప్పల్లోకి తుళ్లిపోగా, వెనుక కూర్చున్న బాబూరావుపై నుంచి బస్సు వెళ్లిపోయింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. కాసేపు రోడ్డుపై ధర్నా చేశారు. రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. మృతుని తండ్రి దాలినాయుడుకు ముగ్గురు సంతానం కాగా.. బాబూరావు ఒక్కడే కొడుకు, మిగిలిన ఇద్దరు అమ్మాయిలకు వివాహం చేశారు. కుమారుడు మృతి చెందడంతో వారు కన్నీరుమున్నీరయ్యారు. దాలినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు’



బూర్జ మండలం ఉప్పినివలస గ్రామంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

బూర్జ :

అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలో గల ఉప్పినివలస గ్రామంలో గడపగడపకూ మన ప్రభు త్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వి వరించారు. ఎన్నికలకు ముందు పాదయాత్ర సమ యంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీనీ సీఎం వైఎస్ జగన్ అమలు చేశారని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెద్ద ఎత్తున పింఛన్లు మంజూరు చేస్తూ జనవరి నుంచి రూ.3 వేలు పింఛన్ మొత్తాన్ని అందించనున్నట్లు తెలిపారు. సంక్షేమ రాజ్యం కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితులు కర్నేన నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు, ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీ కరణం కృష్ణమూర్తినాయుడు, బుడుమూరు సూర్యారావు, పీఏసీఎస్ చైర్మెన్ బగాది నారాయణమూర్తి, ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు, తహసీల్దార్ ఎస్.రమణారావు తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని లారీ డ్రైవర్ మృతి




పైడిభీమవరంలో ప్రమాదానికి గురైన లారీ

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ బిజ్వాల్ ఖాన్(24) మృతి చెందాడు. జార్ఖండ్ నుంచి ఐరన్ దిమ్మెల లోడుతో వస్తున్న డ్రైవర్ బిజ్వాల్ ఖాన్ పైడిభీమవరం వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న డివైడర్‌ను గురువారం రాత్రి 11.50 నిమిషాల సమయంలో ఢీకొట్టాడు.

దీంతో ఐరన్ దిమ్మెలు ముందు క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్‌ను బలంగా తాకాయి. ఐరన్ దిమ్మెల మధ్య ఇరుక్కుపోవడం వల్ల నాలుగు గంటల పాటు నరకయాతన అనుభవించి చనిపోయాడు. పోలీసులు, స్థానికులు శ్రమించి శుక్రవారం ఉదయం 3గంటల సమయంలో మృతదేహాన్ని బయటకు తీశారు. డ్రైవర్ జార్ఖండ్ రాష్ట్రానికి చెందినవాడు. జేఆర్ పురం ఎస్ఐ జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గాయపడిన వ్యక్తి కన్నుమూత



లక్ష్మణరావు మృతదేహం

హిరమండలం: మండలంలోని గొట్టా గ్రామానికి చెందిన దిమిలి లక్ష్మణరావు (48) శుక్రవారం మృతిచెందారు. ఈ నెల 24న ఆయన హిరమండలం నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. గ్రామ సమీపంలో రోడ్డుపై బైక్ అదుపు తప్పింది. దీంతో లక్ష్మణరావుకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో కుటుంబసభ్యులు హుటాహుటిన విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మణరావు గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య నీలమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్‌కానిస్టేబుల్ రమణ తెలిపారు.

కిడ్నీ వ్యాధితో మాజీ నక్సలైట్ మృతి



డాక్టరు గేదెల రామారావు

పలాస: పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన మాజీ నక్సలైటు డాక్టర్ గేదెల రామారావు(75) గురువారం రాత్రి మృతి చెందారు. ఆయన కొన్నేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధ పడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నారు. పలాసలో నూతనంగా ప్రారంభమైన కిడ్నీ ఆస్పత్రిలో ఆయన వైద్య సేవలు పొందారు. ప్రభుత్వం కల్పించిన రూ.10వేలు పింఛన్ కూడా అందుకుంటున్నారు. పరిస్థితి విషమించడం, వయసు సహకరించకపోవడంతో గురువారం రాత్రి కన్నుమూశారు. శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటంలో ఆయన పాల్గొని జైలు జీవితం గడిపారు. జైలు నుంచి విడుదలయ్యాక ఉద్దానం ప్రాంతంలోని గ్రామాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఆయన మృతి ఉద్దానం ప్రజలకు తీరని లోటని ఆయన సహచరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. శుక్రవారం సాయంత్రం అభిమానులు, బంధువుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ డైరెక్ట్ 10th, One Sitting Inter, B.A, Degree, PG, BBA, BCA, MBA, MCA, Diploma, B.Tech, M.Tech, D.Pharma, B.Pharma, B.SC (Arg), B.SC (Nursing), BEd, BL, Ph.D Eligible for All Govt Jobs, Furthier Studies and Abroad. Ph: 83417 74299 [V- 796960]

■ Single Sitting : 10th, 12th, BA, B.Com, B.Sc, MA, MCom, MSc, MBA, BBA, BCA BTECH, DIPLOMA, AGRICULTURE, PHARMACY, NURSING (for drop outs/ Backlogs) from UGC recognised Universities CALL : 73383 76874 [R-221]

TO-LET
■ To Let : 830 sft, First Floor 2 Flats, Plot No-17 at Vinayanagar Layout, Ambativalasa, Vizianagaram. Cont : 91777 55351 [V- 11794]

WANTED
■ కష్టమైన్లీ కాదు.VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ : 15000 -40000, ఫ్రీ రూమ్+భోజనం. Hyd. 7993583999 [HA-1036]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను.ఫ్రీవసతి+భోజనం జీ.18K.ఫోన్: 9640258899/9640468899. [HA-1041]

■ విజయవాడ ప్రముఖ హెల్త్‌కేర్ సర్వీసెస్ ఆఫీస్ వారికి వృద్ధులను, బెడ్ పేషెంట్లను వారి ఇంటి వద్దనే ఉండి చూసుకొనుటకు ఆయాలు, నర్సులు, వార్డ్‌బాయ్స్, కాంపౌండర్స్ కావలెను. జీతం 15-25K భోజనం + వసతి. కాల్/వాట్సాప్ 98850 25559, 91608 35559 [B-584]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1167577]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.